క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహకరించండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యాదవులు

యాచారం: నక్కర్తమేడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయానికి ఆర్థిక సహాయం చేయాలని యాదవ సంఘం నేతలు కోరారు. బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య యాదవ్, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పేద ప్రజల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: పేద, మధ్య తరగతి బీసీ, ఎస్సీ,ఎస్టీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేద పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం, అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు, 200 గజాల ఇంటి స్థలం, నాలుగు గదుల ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు భవాని శేఖర్, భాస్కర్, శ్రీకాంత్, రమేష్, సాయికుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పించండి



సమావేశంలో ముదిరాజ్ నేతలు

ఇబ్రహీంపట్నం: కులగణన అనంతరం ముదిరాజుల జనాభాను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కులగణన తరువాత పెరిగే బీసీ రిజర్వేషన్లలో ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. బీసీ–డి నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. రాష్ట్రంలో మత్స్యకార్మిక సొసైటీని ఏర్పాటు చేసి, పాలకవర్గాన్ని నియమించాలని పేర్కొన్నారు. గురువారం మత్స్యకార్మిక దినోత్సవం సందర్భంగా ముదిరాజులు ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, కావలి శ్రీశైలం, జలమోని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న పరమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని బుధవారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వరకాల పరమేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. హక్కు, భద్రత, ప్రేమ, శాంతి, శ్రద్ధ, స్వేచ్ఛ, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి

కడ్తాల్: పశువుల సంరక్షణకు రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. బుధవారం మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో పశు సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో 35 ఆవులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో 5 ఆవులకు గర్భాశయ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. మరో 3 ఆవులు వయో మెట్రాతో బాధపడుతున్నట్లు గుర్తించి, చికిత్స అందించారు. 7 దూడలకు నట్టల నివారణ చికిత్స అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కనీస అవసరాలకు కష్టమే..



ఆరుట్ల ఎస్సీ బాలుర వసతి గృహం

- వసతిగృహంలో నీటి కష్టాలు
- పక్షం రోజులుగా నీటిసరఫరా బంద్
- బకెట్లతో బడినుంచి మోస్తున్న బాలలు

మంచాల: వసతిగృహంలో తలదాచుకుంటున్న పేద విద్యార్థులకు నీటి కష్టాలు తప్పడం లేదు. పక్షం రోజులుగా నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. వంద మంది వరకు ఉన్న హాస్టల్‌లో సమస్య ఉత్పన్నమయినప్పటికీ.. ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పక్కనే ఉన్న బడి నుంచి బాలలు నిత్యవసరాలకు బకెట్లద్వారా నీటిని మోస్తున్నారు.

గోడదూకి..

మంచాల మండల పరిధి ఆరుట్ల గ్రామం ఎస్సీ బాలుర వసత గృహంలో 99 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరూ పక్కనే ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. 15 రోజులకు పైగా హాస్టల్‌కు నీటి సరఫరా నిలిచి పోయింది. కనీసం కనీస అవసరాలకు కూడా చుక్కనీరు లేక ఇబ్బంది పడుతున్నారు. విధిలేక హాస్టల్ పక్కనే ఉన్న పాఠశాల నుంచి నిత్యం బకెట్ల ద్వారా నీటి తెచ్చుకుంటున్నారు. అడ్డుగా గోడ ఉండటంతో ఎవరైన పెద్దవారు ఉంటే వారి సహాయంతో, లేని పక్షంలో వారే ప్రహరి ఎక్కి నీటిని మోస్తున్నారు. ప్రమాదమని తెలిసినా.. తప్పడం లేదంటూ బాలలు వాపోతున్నారు. కొంత మంది చిన్నారులు ఉదయం 5 గంటలకు లేచి, పాఠశాల ఆవరణలో స్నానం చేస్తున్నారు. ఇంత మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో నీటి కొరత ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. ఇదే విషయంపై వార్డెన్ భాషయ్యను వివరణ కోరగా.. హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఉన్న బోరు పాడయిందని, త్వరలో మరమ్మతు చేయించి, సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



ఉన్నత పాఠశాలలో స్నానం చేస్తున్న విద్యార్థులు

ఇబ్బందిగా ఉంది



నీరు లేక చాలా ఇబ్బందిగా ఉంది. కనీసం బాత్‌రూంకు వెళ్లాలంటే కష్టంగా మారింది. పదిహేను రోజులుగా ఇక్కట్లు పడుతున్నాం. పక్కన పాఠశాల నుంచి బకెట్లతో నీటిని తెచ్చుకుని వాడుకుంటున్నాం.

– ధనుష్, 5వ తరగతి

గత్యంతరం లేక..

వసతిగృహంలో ఏర్పడిన నీటి కొరతతో బాలలు భగీరథ యత్నం చేస్తున్నారు. కనీస అవసరాలకు కష్టంగా ఉండటంతో.. పెన్ను పుస్తకాలతో కుస్తీపట్టాల్సిన ఆ చిన్నారులు.. గత్యంతరం లేక ప్రహరి దూకి ఇతరుల సహాయం, లేదా.. స్వయంగా బకెట్ల ద్వారా నీటిని మోస్తున్నారు. పరిస్థితిని చూసి 'సాక్షి' పలకరించగా.. రెండు వారాలుగా హాస్టల్‌కు నీరు రావడం లేదని, ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.



గోడపై నుంచి నీటిని తీసుకెళ్తున్న విద్యార్థులు

పాడి రైతుల పరేషాన్

- బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న వైనం
- పశుపోషణ భారంగా మారింది
- బిల్లులు సకాలంలో చెల్లించి పాడి రైతులను ఆదుకోండి
- సంఘం నాయకుల డిమాండ్

కడ్తాల్: పాల బిల్లులు సకాలంలో అందక పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, పశుపోషణ భారంగా మారిందని వాపోతున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించి, ఆదుకోవాలని పాడి రైతు సంఘం నాయకుడు కడారి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పాడి రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. విజయ డెయిరీకి పాలు విక్రయిస్తున్న వారికి రెండు నెలలుగా బిల్లులు రావడం లేదని పేర్కొన్నారు. దీని వలన రైతులకు పశుపోషణ ఇబ్బందిగా మారిందని తెలిపారు. రైతుల అవసరాలను గమనించిన ప్రైవేట్ డెయిరీ వ్యాపారులు.. పాల ధరను తగ్గించి, పాలు సేకరిస్తున్నారని వాపోయారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం పశు పోషణ భారంగా మారిందని గ్రాసం, మందుల ధరలు విపరీతంగా పెరిగాయని వివరించారు. కష్టనష్టాలకోర్చి పాడిని నమ్ముకున్న వారికి బిల్లులు అందకపోవడంతో నష్టపోతున్నారని, దీనితోడు పాల ధర తగ్గడంతో మరింత ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, పలువురు పాడిని వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. పాడి రైతులను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశమై గతంలో పలుమార్లు నిరసనలు వ్యక్తం చేశామని, ప్రభుత్వం స్పందించని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు ఇప్పల మల్లేశ్, కృష్ణయ్య, శ్రీను, జంగయ్య, బాలరాజు, మల్లేశ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు రామకృష్ణ

నగరంలో లయన్స్‌క్లబ్ సమావేశాలు

ఆమనగల్లు: సుమారు పదిహేనేళ్ల తరువాత నగరంలో లయన్స్‌క్లబ్ ఇసామిఫోరం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సండడి నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఫోరం సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఏరియా ఫోరం సమీక్ష తరహాలోనే ఇండియా, సౌత్ ఏసియా, మిడిల్ ఈస్ట్ దేశాలు సభ్యులుగా సమావేశం జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాబురావ్ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి లయన్ సభ్యులందరూ రిజిస్ట్రేషన్ చేసుకొని హాజరుకావాలని సూచించారు. సమావేశంలో లయన్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్ర కుమార్, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ శ్రీను, సత్యనారాయణ, రమేశ్, లయన్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బాలాజీనగర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు పాష, చంద్రశేఖర్, యాదయ్య, నర్సింహ, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లయన్ నరేందర్‌రెడ్డి

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి

- జీవాల పెంపకం దారులకు రూ.2 లక్షలు ఇవ్వాలి
- జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంటయ్య యాదవ్

తలకొండపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గొర్రెలు, మేకల పెంపకం దారులకు రూ.2 లక్షల నగదు బదిలీ చేయాలని జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జల్లెల పెంటయ్య యాదవ్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. బుధవారం మండల పరిధి వెల్జాల్ గ్రామంలో సంఘం అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవాలకు వ్యాధి నిరోధక మందులు ఇవ్వాలని, ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని, రాయితీతో కూడిన దాణాను సరఫరా చేయాలని కోరారు. పశు వైద్య కేంద్రాలు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేసే విధంగా చూడాలన్నారు. 50 ఏళ్లు దాటిన కాపరులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు చనిపోతే.. వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్‌ఎల్‌ఎం పథకంలో గొల్ల కుర్మల యువతకు 50 శాతం రిజర్వేషన్‌తో గొర్రెల ఫామ్స్ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య, చంద్రయ్య, శ్రీశైలం, శ్రీను, నరసింహ, బాలయ్య, మల్లేశ్, విష్ణు, ఆంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

ఉచితంగా కంటి పరీక్ష



అద్దాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో పట్టణంలో నిర్వహిస్తున్న మెగా కంటి వైద్య శిబిరంలో రెండో రోజు బుధవారం 360 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారిని మందులు, అద్దాలను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. శిబిరంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్, కంటి వైద్యులు చంద్రశేఖర్, ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లయ్య, కొండల్‌యాదవ్, రవియాదవ్, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్ సేవలు వినియోగించుకోండి



అన్నదాన శిబిరాన్ని ప్రారంభించిన చెన్నకేశవరెడ్డి తదితరులు

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విశ్వనాథం గుప్తా 28వ వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లియోక్లబ్ కడ్తాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన శిబిరాన్ని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా , లయన్ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రయాణికులకు ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 450 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు మహేశ్, బీచ్యానాయక్, వెంకటేశ్, రాజేందర్‌యాదవ్, కుమార్, సురేశ్, పీఆర్‌ఓ పాష తదితరులు ఉన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులు.. నివారణ



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రవణ్ రైతులకు సూచించారు. వ్యాధి బారిన పడినట్లయితే వెంటనే చికిత్స అందజేయాలన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. 25 పశువులకు చూడి, గర్భాశయ పరీక్షలు అల్ట్రాసౌండ్ యంత్రంతో నిర్ధారించారు. 40 పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. 18 పశువులకు సాధారణ చికిత్స చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పశువులు కట్టిన తరువాత 28 రోజులకు చూడి పరీక్ష ద్వారా గుర్తించవచ్చని, దీని ద్వారా పునరుత్పత్తి సామర్థ్యం పెంచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సదానందం, సిబ్బంది జగన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

అబ్దుల్లాపూర్‌మెట్: అయ్యప్ప మాల ధారణ భక్తులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని మండల పరిధి కవాడిపల్లి గ్రామం కోదండ రామచంద్ర స్వామి దేవాలయంలో బుధవారం ప్రారంభించారు. జనవరి 3వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2గంటల వరకు బొడిగె రమేష్‌గౌడ్ గురుస్వామి చేత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని భిక్ష స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో గురువారం నుంచి పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపడుతామన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధి మక్తమాధారం గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మార్గంలో నూతనంగా ఆర్టీసీ బస్ సౌకర్యాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చదువు, ఇతర పనుల నిమిత్తం వెళ్లేందుకు బస్సు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులకు బస్సు సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. రవాణా సమస్య తీరడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మంజుల, నాయకులు రామకృష్ణ, నర్సింహగౌడ్, యాదగిరి, చెన్నయ్య, మహేందర్, శ్రీనివాస్, జంగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

తుర్కయంజాల్: హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మంటపారాధన, హోమాలు, జపములు, తీర్థప్రసాదాల వితరణ, శయ్యాధివాసం, వస్త్రాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ భక్తులు, సాధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ దాతలు తాటిచెట్టు అశోక్ గౌడ్, గీతాదేవి తెలిపారు.



అయ్యప్ప పూజలో భక్తులు

అతివలను ఆర్థికంగా బలపర్చడమే లక్ష్యం

- ఏపీఎం రాజేశ్వరి
- పొదుపు సంఘంలో పలువురు మహిళల చేరిక
- సంఘం ప్రయోజనాలపై అవగాహన

కడ్తాల్: మహిళా సంఘంలో లేని వారిని గుర్తించి, సభ్యులుగా చేర్పిస్తున్నామని ఏపీఎం రాజేశ్వరి తెలిపారు. సభ్యులుగా చేరిన వారికి ప్రభుత్వం ద్వారా రుణాలు అందజేసి, ఆర్థికంగా బలపడేందుకు ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా బుధవారం మండల పరిధి సాలార్‌పూర్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడారు. సభ్యులకు స్త్రీల్ బ్యాంకు ఏర్పాటు, పేరటి కోళ్ల పెంపకం, ముర్ర పశువులు, పౌల్ట్రీ మదర్ యూనిట్, మీ సేవ కేంద్రాలు, ప్రమాద బీమా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ వడ్డీలేని రుణాలు, ఎంటర్‌ప్రైజెస్‌లు, పీఎంఎఫ్‌ఎంఈ స్కీమ్, డ్వాక్రా బజారులు, యూనిఫాంల తయారీ, చీరల పంపిణీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర స్వయం ఉపాధి అంశాలపై వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిధి మహిళా సమాఖ్య గ్రామ అధ్యక్షుడు, సీసీలు, నర్సింహ, రాములు, మల్లేశ్, వసంత, జరీనా, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: మహిళ సంఘాలతో మాట్లాడుతున్న సమాఖ్య అధికారులు

పాస్ బుక్‌లు పంపిణీ

తలకొండపల్లి: పొదుపు సంఘం మహిళలు మహిళా శక్తి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధి లింగారావుపల్లిలో ఏపీఎం శ్రీదేవి ఆధ్వర్యంలో సంఘం మహిళా సభ్యులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలను కలుసుకున్నారు. సంఘం ప్రయోజనాలను వివరించారు. సంఘంలో చేరినట్లయితే అనేక లాభాలుంటాయని అవగాహన కల్పించారు. నేటి నుంచి డిసెంబర్ 9 వరకు చేరిక సంఘంలో చేరవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సంఘంలో చేరిన వారికి వ్యక్తిగత పాస్ బుక్‌లు అందజేశారు. నెలనెలా క్రమం తప్పకుండా పొదుపు డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీసీదీపా, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.



తలకొండపల్లి: లింగరావుపల్లిలో పాస్‌బుక్‌లు అందజేస్తున్న ఏపీఎం తదితరులు